శ్మశానాన్ని అభివృద్ధి చేయండి


మచిలీపట్నంటౌన్: నగరంలోని 36వ డివిజన్ రాజుపేట మగ్గాల కాలనీ ఎస్సీ కాలనీ, దేశాయిపేట, వర్రేగూడెం వాసులకు చెందిన చల్లపల్లి బైపాస్‌రోడ్‌లో ఉన్న శ్మశానాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ ఆ ప్రాంతవాసులు బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు)కి వినతిపత్రం సమర్పించారు. 34వ డివిజన్ పరిధిలోని చల్లపల్లి బైపాస్ రోడ్‌లో ఉన్న శ్మశాన భూమికి సర్వే చేయించి హద్దులు వేయించాలని, ప్రహరీ నిర్మించాలని కోరారు. బోరింగ్ పంపు ఏర్పాటు లేదా బావి తవ్వించాలని కోరారు. సర్వే చేయించి హద్దులు వేయకుంటే శ్మశాన స్థలం ఆక్రమణలకు గురవుతోందన్నారు. మగ్గాల కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, కో ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, అర్బన్‌బ్యాంక్ డైరెక్టర్ జవ్వాది రాంబాబు, మగ్గాల కాలనీ వాసులు దార్ల చెన్నకేశవరావు, దమ్ము కేశవరావు, బూరగ రామారావు, ప్రత్తిపాటి ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

మచిలీపట్నం టౌన్: నగరంలోని రాజుపేట ఆంధ్ర జాతీయ కళాశాల రోడ్‌లో 170 సంవత్సరాల పురాతన శ్రీ సీతా సమేత హరి కోదండ రామాలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ శ్రీ వాణి పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షలు, భక్తుల సహకారంతో ఆలయ జీర్ణోద్ధరణ నిర్వహించారు. ఆలయ ప్రారంభంతో పాటు సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, గణపతి, సరస్వతీదేవి పాలరాతి, పంచలోహ విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), డెప్యూటీ మేయర్ శీలం భారతి హాజరయ్యారు. మధ్యాహ్నం అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.









అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పేర్ని కిట్టు

మచిలీపట్నం టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను చూసి మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. నగరంలోని 28వ డివిజన్ ఇనకుదురుపేట జెండా సెంటర్ సమీపంలో, 36వ డివిజన్ రాజుపేట పిండాల దొడ్డి వద్ద కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి బుధవారం ఆయన నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బందరు పోర్టు పనుల ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నగరంలో ఆరు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరగా స్పందించి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో నగరంలోని ఆరు డివిజన్‌లలో ఒక్కొక్కటి రూ.50 లక్షల చొప్పున వ్యయంతో కమ్యూనిటీ హాళ్లను నిర్మించేందుకు నిర్ణయించి శంకుస్థాపన చేస్తున్నామన్నారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం వేగవంతంగా చేసి కొద్ది నెలల్లోనే ప్రారంభిస్తామన్నారు. వీటి వల్ల ఆయా డివిజన్‌లలోని పేద ప్రజలు శుభకార్యాలను జరుపుకొనేందుకు వీలు కలుగుతుందన్నారు. బందరుకు పోర్టు, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్ వంటి భారీ ప్రాజెక్టులను సీఎం జగన్ ఇచ్చారన్నారు. ఈ ప్రాజెక్టులతో ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. వీటితో పాటు నివేశన స్థలాలు, పక్కా ఇళ్లు, నవరత్న పథకాలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి పేద కుటుంబాన్నీ ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్‌లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్‌లు షేక్ షాహీనా, మాచవరపు రామ్‌ప్రసాద్, రాసంశెట్టి వాణిశ్రీ, యండ్రపాటి నాగేశ్వరరావు, శ్రీరాం చిన్నా, కో ఆప్షన్ సభ్యులు మట్టా తులసి, బేతపూడి రవి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ జవ్వాది రాంబాబు, మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్ కుమార్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు షేక్ మహమ్మద్ సాహెబ్, బూరగ రామారావు, చీలి చక్రపాణి, మిరియాల రాంబాబు, రాసంశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.


28వ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


కోడూరు సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు సచివాలయ పరిధిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను బుధవారం రమేష్‌బాబు ప్రారంభించారు. ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రమేష్‌బాబు మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం కల్పిస్తూ చరిత్రలో నిలిచిపోయే పథకాలను అమలు చేశారని రమేష్‌బాబు అన్నారు.

సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభం

మండలంలో రూ.1.52 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన కోడూరు–2, కోడూరు–3 సచివాలయాలు, కోడూరు–1, కోడూరు–3 వెల్‌నెస్ సెంటర్లు, కోడూరు–2 ఆర్‌బీకే కేంద్రాలను రమేష్‌బాబు ప్రారంభించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

తీరప్రాంత గ్రామాల ప్రజల విద్యుత్ కష్టాలకు చెక్ పెడుతూ రామకృష్ణాపురంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించారు. సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. కోడూరు, మందపాకల, నాగాయలంక సబ్‌స్టేషన్లపై లోడ్ భారం తగ్గుతుందని, దీంతో మండల కేంద్రాల్లో కూడా పూర్తిస్థాయిలో విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంతకుముందు ఇరాలి, రామకృష్ణాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన రూ.17లక్షల నిధులతో నిర్మించిన రెండు సీసీ రహదారులను రమేష్‌బాబు ప్రారంభించారు.

పాపవినాశనం ఎస్జీటీ టీచర్ సస్పెన్షన్

పెడన: విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సెకండరీ గ్రేడ్ టీచర్‌పై వేటు పడింది. ఘంటసాల మండలం పాపవినాశనం ప్రాథమిక మండల పరిషత్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాస్ అదే పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వైనంపై సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీనిపై స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా సదరు టీచర్‌ను సస్పెండ్ చేసి, విచారణకు ఆదేశిస్తూ బుధవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు: మండలంలోని లేళ్లగరువులో పునర్నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ బుధవారం కనుల పండువగా సాగింది. గ్రామస్తులంతా విరాళాలు సేకరించి దాదాపు రూ.కోటి వ్యయంతో నిర్మించిన ఈ ఆలయంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమంతు, గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద పండితులు రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో యాగశాలలో ప్రత్యేక పూజలు జరిపి ఉదయం 10 గంటల 8 నిమిషాలకు దేవతామూర్తుల ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జ్ ఉప్పాల రాము గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావుతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామసర్పంచ్ నరహరిశెట్టి మానస గణేష్ పీఏసీఎస్ చైర్మన్ రాయపురెడ్డి శ్రీనివాసరావు వారికి ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు బూరగడ్డ వేదవ్యాస్, కాగిత కృష్ణప్రసాద్ వేర్వేరుగా రావడం గమనార్హం. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

కమిషనర్ బాధ్యతల స్వీకారం

పెడన: పెడన పురపాలక సంఘ కమిషనర్‌గా బి.వెంకటరామయ్య బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన వెంకటగిరి పురపాలక సంఘం నుంచి బదిలీపై పెడన వచ్చారు. తొలుత ఈయన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్‌లను వారి చాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ రాజాబాబును మచిలీపట్నం వెళ్లి కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 15, 45 డివిజన్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించారు. 15వ డివిజన్‌లోని మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో, 45వ డివిజన్ శిశు విద్యామందిరం వద్ద ఉన్న సచివాలయంలో వైద్యశిబిరాలు నిర్వహించి, రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరాలను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మొహమ్మద్ షెహనాజ్ బేగం, ఆకుల వరలక్ష్మి ఆయా డివిజన్ల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు మొహమ్మద్ రఫీ, ఆకుల శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

● **మచిలీపట్నం టౌన్:** సుకర్లాబాద్‌లో నెల్లూరు రవీంద్ర భారతి స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు ప్రారంభించారు.

ఎన్నికల విధులపై అప్రమత్తం

పెడన: రానున్న సార్వత్రిక ఎన్నికల విధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి, ముడా వైస్ చైర్మన్ పి.వెంకటరమణ అన్నారు. మచిలీపట్నంలోని ముడా కార్యాలయంలో బుధవారం పెడన నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన తహసీల్దారు, ఎంపీడీవోలతో పాటు పెడన మున్సిపల్ అధికారులతో ఎన్నికలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

నేడు జీ+3 టిడ్కో గృహాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని గో సంఘం వద్ద నిర్మించిన జీ+3 టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బాపిరాజు బుధవారం తెలిపారు. 14 బ్లాక్‌లలో నిర్మించిన 864 ప్లాట్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ పంపిణీ చేస్తారన్నారు. గృహ సముదాయాల వద్ద ఇప్పటికే తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు పూర్తి చేశామని కమిషనర్ తెలిపారు.

ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ మచిలీపట్నం నియోజకవర్గ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా నీలా పూర్ణచంద్రరావు, గౌరవాధ్యక్షుడిగా లంకపల్లి రామచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా గుడిపాటి లక్ష్మీ అనూరాధ,విజయకుమారి, ప్రధాన కార్యదర్శిగా గొట్ల చైతన్యబాబు, సహాయ కార్యదర్శులుగా సరస్వతి, కిరణ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పి.శ్రీనివాసరావు, కె అశోక్‌కుమార్, ట్రెజరర్‌గా కె.కొండలయ్య ఎన్నికయ్యారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేత

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో నూరు శాతం హాజరు సాధించిన 25 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున నగదు ప్రోత్సాహాన్ని సీఐ పీవీ త్రినాథ్ అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.





